



చలి @ 6.9

కోహీర్‌లో మరింత పడిపోయిన ఉష్ణోగ్రత

కోహీర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాను చలి వణికిస్తున్నది. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నది. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ సీజన్‌లోనే అత్యల్పంగా 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోనే కోహీర్ మండలం చలి తీవ్రతలో మరోసారి రెండో స్థానంలో నిలిచింది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 9.1 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం అంగడి కిష్టాపూర్‌లో 9.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈశాన్యం నుంచి చలి గాలులు వీస్తుండడంతో చలి తీవ్రత పెరుగుతున్నదని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. సంక్రాంతి వరకు చలి తీవ్రత కొనసాగే అవకాశముందని తెలిపారు. ఎముకలు కొరికే చలికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచే చలి ప్రభావం ప్రారంభమవుతుండడంతో ప్రజలు ఇళ్లలోకి చేరుకుంటున్నారు. అత్యవసరమైతే తప్ప ఉదయం 9 దాటినా బయటకు రావడానికి జంకుతున్నారు. తెల్లవారినా చలిమంటలు వేసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రత వివరాలు

సంగారెడ్డి జిల్లాలో కోహీర్ 6.9, అల్గోల్ 7.6, న్యాల్‌కల్ 7.7, నల్లవల్లి 8.1, అల్మాయిపేట్ 8.6, ఆర్సీపురం 8.8, లక్ష్మీసాగర్ 9, మల్‌చేల్మ 9.2, కంకోల్ 9.2, కంది 9.6, సిర్గాపూర్ 9.6 కంగ్టి 9.8, అన్నాసాగర్ 9.8, నిజాంపేట్ 9.8, పుల్కల్ 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ 9.1, బోడగట్టు 9.2, కొత్తపేట 9.7, చిప్పల్‌తుర్తి 9.9, శివ్వంపేట 9.9 డిగ్రీలుగా నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్‌లో 9.7, రాయపోలు మండలం బేగంపేట్‌లో 10.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇందిరమ్మ ఇంకాస్త లేటే..!

- సంక్రాంతికి ముగ్గు లేనట్లే..
- సర్వే 82 శాతమే పూర్తి
- సాంకేతిక సమస్యలతో నత్తనడక
- ఏఐ ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక?

ప్రభుత్వం అనుకున్నట్లు ఈ సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసే పరిస్థితి కనిపించడం లేదు. సాంకేతిక కారణాలతో పాటు, సర్వే పూర్తి కాకపోవడంతో అనుకున్న సమయంలో అనుకున్న విధంగా పనులు సాగే పరిస్థితులు క్షేత్రస్థాయి లేవనే చెప్పాలి. సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,30,483 మంది ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారు.

- దుబ్బాక, జనవరి3 (ఆంధ్రజ్యోతి)



ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల సర్వే గతేడాది డిసెంబరు నాటికే పూర్తి చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే, జిల్లాలో గడువు తేదీ వరకు కేవలం 82.42 శాతం మాత్రమే సర్వే పూర్తి అయింది. గ్రామాల్లో తరచూ సర్వర్ సమస్యలు తలెత్తడం, ఇంటర్‌నెట్ సదుపాయం తక్కువగా ఉండటంతో సర్వే సజావుగా సాగలేదు. అంతేకాకుండా వివరాల నమోదుకూ ఎక్కువ సమయం పట్టింది. నాలుగు నిమిషాల్లో జరగాల్సిన ఎంట్రీ గంటకుపైగా సాగిందని ఎన్యుమరేటర్లు చెప్పారు. దీంతో ఒక్క రోజులో కేవలం 170 దరఖాస్తుల సర్వే మాత్రమే జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం సర్వే నిర్వహించిన సమయంలో దరఖాస్తుదారులూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కొందరు ఉపాధి కోసం ఇతర

మిగతా 8వ పేజీలో...

మున్సిపాలిటీ	దరఖాస్తులు
సిద్దిపేట	17,618
దుబ్బాక	5,142
చేర్యాల	3,092
గజ్వేల్	6,231
హుస్నాబాద్	4,541

మండలం	దరఖాస్తులు
కొండపాక	11,816
అక్కన్నపేట	10,960
దుబ్బాక	10,679

నేడే ముత్యాల ముగ్గుల పోటీలు

- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని క్రాంతి హైస్కూల్‌లో నిర్వహణ
- ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి నగదు బహుమతులు

సిద్దిపేటటౌన్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు, గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్‌పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నేడు సిద్దిపేటలోని హైదరాబాద్ రోడ్డు, సవిత పెట్రోల్ బంకు ఎదురుగా, మైత్రి వనం కాలనీలో గల క్రాంతి హైస్కూల్ ఆవరణలో జరగనున్నాయి. ఈ పోటీలకు స్థానిక స్పాన్సర్‌గా క్రాంతి పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తోంది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 9.30 గంటల వరకు క్రాంతి పాఠశాలకు చేరుకోవాల్సి ఉంటుంది. విజేతలకు మొదటిబహుమతిగా రూ. 6వేలు, రెండో బహుమతిగా రూ.4వేలు, మూడో బహుమతిగా రూ. 3వేలు అందజేయనున్నారు. అలాగే మరో ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులతో పాటు, ముగ్గుల పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు సిద్దిపేట జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ స్వాతిరెడ్డి, పోలీస్ కమిషనర్ అనురాధ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజులరాజనర్సు, ప్రముఖ వైద్యురాలు శిరీష, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి సౌందర్య హాజరు కానున్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు, యువతులు 9866864742, 9666568886 నంబర్లకు ఫోన్ చేసి తప్పనిసరిగా తమ పేర్లు నమోదు చేసుకోవాలి.



సమ్మె ప్రభావం.. చదువుకు ఆటంకం

- 25 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన
- టీచర్లు కావాలంటూ కేజీబీవీ విద్యార్థుల ఆందోళన
- విద్యాశాఖలో నిలిచిన సేవలు
- మధ్యాహ్న భోజనం బిల్లుల ప్రాసెస్ బంద్

7లో

మద్యం అమ్మొద్దు.. తాగొద్దు

- అమ్మితే రూ.5లక్షలు.. కొనుగోలు చేస్తే రూ.10వేల జరిమానా
- తిమ్మాపూర్ గ్రామస్థుల తీర్మానం

జగదేవ్‌పూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎవరూ మద్యం అమ్మొద్దని, తాగొద్దని జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామస్థులు శుక్రవారం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామంలో బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మడంతో గొడవలు జరుగుతున్నాయని వివరించారు. చాలా మంది మద్యానికి బానిసలవుతున్నారని, సంసారంలో చిచ్చులు రేగుతున్నాయని స్పష్టం చేశారు. అందుకు గ్రామస్థులంతా ఒకతాటిపైకి వచ్చి గ్రామంలో మద్యం అమ్మొద్దు.. తాగొద్దు అని తీర్మానం చేశారు. మద్యం అమ్మితే రూ.5లక్షల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ఎవరైనా మద్యం కొనుగోలు చేస్తే రూ.10వేల జరిమానా తప్పదని హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా దొంగచాటున మద్యం అమ్మితే ఆ సమాచారాన్ని గ్రామస్థుల దృష్టికి తీసుకొస్తే వారికి రూ.5వేల ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దుకుంటామని పేర్కొన్నారు. తీర్మాన పత్రాన్ని జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్‌కు కూడా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో మద్యం కొనుగోలు, అమ్మకంపై తీర్మానం చేస్తున్న గ్రామస్థులు

శాంతి భద్రతలకు పెద్దపీట

సిద్దిపేట క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని జిల్లా పోలీసు అధికారులకు సీపీ అనురాధ సూచించారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సీపీకి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఆశలతో ప్రతీ ఒక్కరూ ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఆత్మహత్యల నివారణకు తగు చర్య లు తీసుకోవాలని సూచించారు. మహిళలకు బాలికలకు సంబంధించిన కుటుంబ సభ్యులను కేసులను ఒకే దగ్గర పరిష్కారం అయ్యే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని, ఆరోగ్యరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చేర్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చేర్యాలలోని పుర్మ అంజిరెడ్డి ఇంటిపక్కన అక్రమంగా నిల్వచేసిన 5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. రేషన్ డీలర్ దేవయ్యతో పాటు ఉమాపతి కలిసి రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశారన్న సమాచారంతో దాడులు చేసి పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని విక్రయించినా, నిల్వచేసినా, రవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాలువలు పూర్తిచేసి సాగు నీరందిస్తాం

- త్వరలోనే గండిపల్లి ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

అక్కన్నపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలు పూర్తిచేసి వ్యవసాయానికి సాగునీరు అందిస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేటలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలోనే గండిపల్లి ప్రాజెక్టు పనులను ప్రారంభించి హుస్నాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా సాగునీరు అందిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగిరేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంక్రాతికి అర్హులైన రైతులకు రైతు భరోసా పథకం అందిస్తామని, దీనిపై కేబినెట్ సబ్ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని చెప్పారు. అంతకుముందు సావిత్రి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, పలువురు ఉన్నారు.



పోతారం(ఎస్)లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: సావిత్రిబాయిపూలే మహిళల విద్య కోసం ఎన్నో పోరాటాలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆమె పటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆమె ఆశయాలను జ్ఞాపకం చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పేరిట పురస్కారాలు అందజేస్తుందన్నారు. ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడంపై మంత్రి అభినందనలు తెలిపారు. పోతారం(ఎస్) పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేస్తామన్నారు. సీఎం కప్‌లో పాల్గొని సత్తాచాటిన విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయురాళ్లను మంత్రి శాలువా కప్పి సత్కరించారు. స్థానిక యువకుడు బొమ్మగాని రాజ్‌కుమార్ 250 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు అందించినందుకు రాజ్‌కుమార్‌ను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంఈవో మనీల, కౌన్సిలర్ చిత్తారి పద్మ, ఏఎంసీ వైస్‌చైర్మన్ బంకచందు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లంచం అడిగితే అరెస్టే..

ఏసీబీ డీఎస్పీ నంబర్ 9154388947

శేఖర్‌గౌడ్, ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీ, ఉమ్మడి మెదక్

ఫేస్ టు ఫేస్

లంచం అడిగినా అరెస్ట్ చేస్తున్నారు. చట్టంలో మార్పులు వచ్చాయా?

ఇది కొత్త చట్టమేమీ కాదు. అవినీతి నిరోధక చట్టంసెక్షన్ 7ఏ చాలాకాలంగా అమలవుతోంది. దీని ప్రకారం లంచం అడగడం కూడా నేరమే.

వ్యక్తిగత కక్షతో ప్రభుత్వ ఉద్యోగులపై తప్పుడు కేసులు పెట్టే అవకాశం ఉంది కదా?

బాధితులు ఫిర్యాదు చేసినప్పుడే అన్ని ఆధారాలను పరిశీలించి, ఆడియో, వీడియో రికార్డులను తయారుచేసి హైదరాబాద్ కార్యాలయానికి సమాచారం ఇస్తాం. ఆయా రికార్డులను ల్యాబ్‌కు పంపించి నిర్ధారణ చేసుకున్న తర్వాత సదరు ఉద్యోగి డబ్బులు అడిగినట్టు తేలితేనే అరెస్ట్ చేస్తాం.

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 7ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేశారా? ఎవరినైనా అరెస్ట్ చేశారా?

సంగారెడ్డి జిల్లాలో ఒక కేసు నమోదైంది. అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిని అరెస్ట్ చేశాం. బాధితుడు అందజేసిన ఆడియో, వీడియో రికార్డులు సరైనవేనని నిర్ధారణ చేసుకున్న తర్వాతనే అరెస్ట్ చేశాం.

ఏసీబీకి ఎలా ఫిర్యాదు చేయాలి?

ఎవరైనా ఉద్యోగులు లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబరు 1064 లేదా ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ నంబరు 9154388947కు ఫిర్యాదు చేయవచ్చు. లేదా, సంగారెడ్డిలోని ఏసీబీ కార్యాలయంలో సంప్రదించాలి. బాధితుల నుంచి అన్ని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు ప్రారంభిస్తాం.

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏసీబీలో సరిపడా సిబ్బంది ఉన్నారా?

ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీలో డీఎస్పీ, ఇద్దరు సీఐలతో పాటు ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారు. అవినీతికి వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పిస్తున్నాం.

- సంగారెడ్డి క్రైం (ఆంధ్రజ్యోతి)

డ్రగ్స్, గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

ఝరాసంగం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్, గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చీలపల్లితండాలో కార్డన్ సర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేశారు. చీలపల్లితండాకు చెందిన కొందరు గంజాయి, ఇతర నేరాలకు పాల్పడుతునట్లు తెలిసిందని, అందుకే తండాలో తనిఖీలు నిర్వహించామన్నారు.

క్రైం కార్నర్

ఉపాధి కరువై ఆటో డ్రైవర్ ఆత్మహత్య



తలారి బాలనర్సయ్య మృతదేహం

చేర్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల పరిధిలో చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండలంలోని మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన తలారి బాలనర్సయ్య(42) 15 ఏళ్లుగా ఆటో నడుపుకుని జీవిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నాళ్లుగా ఆటో సరిగ్గా నడవకపోవడంతో ఉపాధి కోల్పోయాడు. కుటుంబపోషణ భారమవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలనర్సయ్య కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మార్చురీలో పోస్టుమార్టం నిర్వహింపచేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

చెరువులో దూకి మహిళ..

తూప్రాన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ మనస్తాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన తూప్రాన్ పట్టణ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ బ్రాహ్మణపల్లికి చెందిన ఇటిక్యాల అంజమ్మ(55) కొద్దిరోజులుగా మోకాళ్ల నొప్పులు, కంటిచూపు సరిగా లేకపోవడం, నరాల వీక్‌నెస్‌తో ఇబ్బందులను ఎదుర్కొంటుంది. వైద్య చికిత్సలు చేయించుకున్నప్పటికీ తగ్గలేదు. ఈ విషయంలో తనలో తాను బాధపడుతుండేది. గురువారం రాత్రి అందరూ పడుకోగానే ఇంట్లోంచి వెళ్లిపోయి సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నది. శుక్రవారం ఉదయం చెరువులో అంజమ్మ శవం తేలడంతో గుర్తించారు. అంజమ్మ కొడుకు ఇటిక్యాల మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

దుబ్బాకలో మరొకరు..

దుబ్బాక, జనవరి3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తిచెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం దుబ్బాకలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ గంగరాజు, కుటుంబసభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక పట్టణానికి చెందిన వీరబత్తిని విమల(63) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఆస్పత్రులకు తిరిగినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో అందరూ పడుకున్నాక గురువారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

110 కిలోల గంజాయి పట్టివేత

- సినీ ఫక్కీలో వాహనాన్ని వెంటాడి పట్టుకున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ సబ్ డివిజన్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 110 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సినీ ఫక్కీలో పోలీసులు స్మగ్లర్ల వాహనాన్ని వెంటాడి పట్టుకున్నారు. ఎస్పీ రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, ఎస్‌ఐలు కాశీనాథ్, ప్రసాద్‌రావు, రాజేందర్‌రెడ్డి జహీరాబాద్ శివారులోని పాత ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున వాహన తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ముంబై వైపు వెళ్తున్న ఓ కారును ఆపే ప్రయత్నం చేయగా వారు ఆపకుండా ముందుకు వెళ్లారు. పోలీసులు ఆ కారును వెంబడించి జహీరాబాద్ శాంతినగర్‌కు చెందిన మహ్మద్ అక్బర్ (22), మహ్మద్ సల్మాన్(24)ను అరెస్టు చేశారు. ఒకరు పరారయ్యాడు. కారులోని రూ.30 లక్షల విలువైన 110 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మద్యంలో విషం కలిపి.. హత్యాయత్నం

- ముగ్గురి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

జగదేవ్‌పూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో అడ్డు తొలగించుకోవాలన్న ఉద్దేశంతో మద్యంలో విషం కలిపి హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన నీరుగంటి నర్సింలు, గరిదాసు గోపీకి పొలానికి వెళ్లే బాట విషయంలో పంచాయితీ ఉన్నది. నర్సింలును చంపితే సమస్య ఉండదని బావించిన గోపి పథకం పన్నాడు. గత నెల 18న మద్యం సీసాలో గడ్డి నివారణ కోసం తెచ్చిన పురుగుల మందును కలిపి నీరుగంటి నర్సింలు గుడిసెలో పెట్టారు. ఈ సీసాను చూసిన నర్సింలు తన మామ మెండే కనకయ్య, నీరుగంటి అయిలయ్య, నీరుగంటి విఘ్నేష్‌ను పిలిచి తాగారు. వారి ఆరోగ్యం క్షీణించడంతో 23న గజ్వేల్‌లో ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లారు. వైద్యులు పరీక్షించి మద్యంలో విషం కలిపారని తేల్చారు. మెండే కనకయ్య కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదుతో ఎస్‌ఐ చంద్రమోహన్ విచారణ చేపట్టారు. యాదగిరిగుట్టలో తలదాచుకున్న తిమ్మాపూర్‌కు చెందిన గరిదాసు గోపి, స్వామి, అయిలయ్య పట్టుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



రాయసముద్రం చెరువు

రాయసముద్రం.. కళావిహీనం

- కాలనీల్లో నుంచి చెరువులోకి మురుగు ప్రవాహం
- నిలిచిన మినీట్యాంక్‌బండ్ పనులు
- భెల్ పరిశ్రమతో హద్దురాళ్ల పంచాయితీ

రామచంద్రాపురం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కాలనీవాసులకు ఆహ్లాదకరంగా ఉండాల్సిన చెరువులు మురుగునీటి కూపాలుగా మారుతున్నాయి. మురుగు నీరు చేరి కళావిహీనంగా మారుతున్నాయి. ఇది రామచంద్రాపురం డివిజన్ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రాయసముద్రం చెరువు దుస్థితి. 120 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువును గతంలోనే రూ.7కోట్ల వ్యయంతో మినీట్యాంక్‌బండ్‌గా



హద్దురాళ్లు ఏర్పాటు చేసిన భెల్ అధికారులు

తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా చేయాలని సంకల్పించారు. మూడేళ్ల క్రితం రూ.5.1 కోట్లను విడుదల చేశారు. వేసవిలో చెరువు ఎండినప్పుడు పూడిక మట్టిని తీయించారు. వర్షాలు కురియడంతో చెరువు నీటితో నిండిపోయింది. నాటి నుంచి ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు.

20 కాలనీలు, బస్తీల నుంచి చెరువులోకి మురుగు

రాయసముద్రం చెరువుకు ఆనుకొని 20పైచిలుకు కాలనీలు, బస్తీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి మురుగు నేరుగా చెరువులోకి చేరుతున్నది. హెచ్‌ఐజీ, ఎల్‌ఐజీ కాలనీలకు చెందిన నీరు సైతం చెరువులోకి పారుతున్నది. వర్షాలు కురియకపోయినా మురుగు నీటితో చెరువు నిండుకుండను తలపిస్తున్నది. చెరువు అంతా గుర్రపుడెక్క పేరుకుపోయి పచ్చగా మారింది. జీహెచ్‌ఎంసీ నిధులతో ఈ గుర్రపుడెక్కను తొలగిస్తున్నప్పటికీ అక్కడే కుప్పలుగా పోస్తున్నారు. వాటిపై వివిధ రకాల పక్షులు విహరిస్తున్నాయి.

చెరువు గట్టు మాదంటూ ఫెన్సింగ్

చెరువు గట్టు మాదంటూ భెల్(బీహెచ్‌ఈఎల్) పరిశ్రమ వారు హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టబోతే బీహెచ్‌ఈఎల్ అధికారులు నిత్యం అడ్డుకుంటున్నారు. రామచంద్రారెడ్డినగర్ కాలనీ నుంచి పాతరామచంద్రాపురం వరకు నిర్మించిన సిమెంటు రోడ్డు నిర్మాణం విషయంలోనూ అడ్డుపడగా.. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. హెచ్‌ఐజీ, ఎల్‌ఐజీ కాలనీల మీదుగా ఉన్న చెరువు గట్టు పైరోడ్డు వేయడానికి భెల్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోడ్డు వేయకుండా అధికారులు వదిలిపెట్టారు. చుట్టుపక్కల కాలనీవాసులు వాకింగ్ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వాకింగ్ చేసే వారికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నిర్మించిన బాత్‌రూంలు నిరుపయోగంగా మారాయి.

మురుగు మళ్లింపునకు ప్రతిపాదనలు

చుట్టుపక్కల కాలనీలకు చెందిన మురుగు చెరువులోకి రానివ్వకుండా అడ్డుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా పైపులైన్ నిర్మాణం చేపట్టాం. రూ.3కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. గతంలో చెరువు లోతు పెంచడానికి మిషన్ కాకతీయ కార్యక్రమం కింద మట్టి తొలగించాం. ఇందుకు రూ.5.1 కోట్లు ఖర్చు అయింది.

-పావని, నీటిపారుదల శాఖ ఏఈ

రాజకీయ స్వార్థం కోసమే జమిలి ఎన్నికలు

- జిమ్మిక్కులకే సావిత్రీబాయి జయంతిని టీచర్స్ డేగా ప్రకటన
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సంగారెడ్డి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వార్థం కోసమే బీజేపీ జమిలి ఎన్నికలని అంటుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే ఒకే దేశం.. ఒకే ఎన్నిక అని బీజేపీ తీసుకువస్తుందని విమర్శించారు. పంజాబ్ రాష్ట్రంలో 39 రోజులుగా రైతులు ఉద్యమం చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో జరిగిన ఉద్యమం సమయంలో కనీస గిట్టుబాటు ధర చెల్లిస్తామని చెప్పిన కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని మండిపడ్డారు. కోర్టు కేంద్రానికి మొట్టికాయలు వేసినా ఎలాంటి ఉలుకుపలుకు లేదని ఎద్దేవా చేశారు. ఈ-ఫార్ములా కేసులో అవినీతి జరిగితే త్వరగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. జిమ్మిక్కుల కోసమే సావిత్రీబాయి జయంతిని టీచర్స్ డేగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. సర్వశిక్షా ఉద్యోగులు 25 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు, జిల్లా కార్యదర్శి జయరాజ్, మాణిక్యం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

సంగారెడ్డి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో రాష్ట్రస్థాయి బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్టును శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పర్యవేక్షణలో ఆన్‌లైన్ వేదికగా పరీక్ష జరిగింది. గతనెల 18న జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన నలుగురు విద్యార్థులు వారి గైడ్ టీచర్ల సహకారంతో వచ్చి పాల్గొన్నారు. ఫలితాలను ఈ నెల 6,7వ తేదీల్లో వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు. గతేడాది సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం దక్కడంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఈసారి ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

బండల మల్లన్న జాతరకు ఏర్పాట్లు

పటాన్‌చెరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందిన పటాన్‌చెరు డివిజన్ బండ్లగూడలోని బండల మల్లన్న జాతరకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 4, 5 తేదీల్లో రెండు రోజులపాటు కొనసాగే ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. కాగా, వందల సంవత్సరాల స్థల చరిత్ర ఉన్న మల్లన్న ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో స్థానిక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్ పునరుద్ధరణకు పూనుకున్నారు. రూ.50 లక్షలతో ఆలయాన్ని పునర్‌నిర్మించారు. శని, ఆది వారాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం మల్లన్న కల్యాణోత్సవం, అనంతరం అగ్నిగుండాలు, బోనాల సమర్పణ, పెద్ద ఎత్తున అన్నదాన సంతర్పణ నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్ తెలిపారు.



బండ్లగూడలోని మల్లన్న ఆలయం

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- యూసీసీ కమిటీ అధ్యక్షుడు సాయిచందర్

పుల్కల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1400 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూసీసీ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాయిచందర్ డిమాండ్ చేశారు. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ అధ్యాపలకు పేస్కేల్‌తో కూడిన వేతనమివ్వాలని శుక్రవారం యూనివర్సిటీ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుంటే 12 యూనివర్సిటీలకు బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి

- తెలంగాణ రెడ్డి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాతూరి వెంకట్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పదెకరాల వరకు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా కల్పించాలని తెలంగాణ రెడ్డి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాతూరి వెంకట్‌రెడ్డి కోరారు. రైతుల బాగు కోసం మరిన్ని సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం రైతు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డిని కోరారు. గురువారం తెలంగాణ రెడ్డి హక్కుల సాధన సమితి నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. అగ్రకులపేదలకు విదేశీ చదువులకు ఉపకార వేతనంను అందించాలన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవడానికి చేనేత కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రెడ్డి హక్కుల సాధన సమితి సూచనలను పరిగణలోకి తీసుకుంటామని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని జితేందర్‌రెడ్డి హామినిచ్చారు.

కూలీల ప్రాణం మీదకు తెచ్చిన గెట్టు పంచాయితీ

నారుమడిపై విషప్రయోగం

మహిళా కూలీలకు వాంతులు

డి.ధర్మారంలో ఘటన





అస్వస్థతకు గురైన మహిళా కూలీలు, విషపూరితం చేసిన నారు

రామాయంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గెట్టు పంచాయితీ మహిళా కూలీల ప్రాణం మీదకు తెచ్చింది. రైతుల మధ్య ఉన్న భూ వివాదం నారుమడిపై విష ప్రయోగానికి కారణమైంది. దీంతో ఏమీ తెలియని అమాయక కూలీలు నాట్లు వేసేందుకు వచ్చి వాంతులు చేసుకున్నారు. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం డి.ధర్మారంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మల్లారెడ్డి, మరో రైతుకు కొంతకాలంగా వ్యవసాయ భూమి విషయంలో గొడవలున్నాయి. పక్కపక్కనే పొలాలు ఉండటంతో గెట్టు పంచాయితీ నడుస్తోంది. ఈ క్రమంలో మల్లారెడ్డి పొలం కౌలుకు తీసుకున్న రైతు ఎరుపుల పోశయ్య వరి నారు సాగు చేశాడు. నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కూలీలను సైతం పిలవగా.. పని ప్రారంభించారు. నాట్లు వేస్తుండగా పలువురు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. ఇదేమిటని నారుమడిలోకి దిగి చూడగా విషప్రయోగం జరిగినట్లు కౌలు రైతు గుర్తించాడు. వెంటనే కూలీలను నాట్లు ఆపి వేయించాడు. ఈ ఘటనపై రైతు మల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో చేర్యాల ఏఎంసీ ఛైర్‌పర్సన్

- ఫుడ్‌పాయిజనా.. ఆత్మహత్యాయత్నమా?
- ఆత్మహత్యాయత్నం అవాస్తవమన్న భర్త వెంకన్న

చేర్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత శుక్రవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రిపాలవడం నియోజకవర్గ వ్యాప్తంగా కలకలం రేపింది. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామానికి చెందిన నల్లనాగుల శ్వేత సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొన్ని నెలల క్రితం చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఆమె నియమాకమయ్యారు. స్థానికంగా జరిగే ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలలో అడపాదడపా పాల్గొంటున్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం చేర్యాల, కొమురవెల్లి తదితర మండలాల్లో ఘనంగా నిర్వహించినప్పటికీ ఆమె పాల్గొనలేదు. శుక్రవారం ఉదయం ఆమె కట్కూరు గ్రామంలోని ఇంట్లో గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని, చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారన్న విషయం నియోజకవర్గంలో దావానంలా వ్యాపించింది. శ్వేతను మెరుగైన చికిత్స కోసం హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిసింది. అయితే, ఆమె భర్త నల్లనాగుల వెంకన్న ఆత్మహత్యాయత్నం ఆరోపణలను ఖండించారు. తన భార్య ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైందని, అసత్య ప్రచారం చేయకూడదంటూ వీడియో సందేశంలో పేర్కొన్నారు.

సమ్మె ప్రభావం.. చదువుకు ఆటంకం

25 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

టీచర్లు కావాలంటూ కేజీబీవీ విద్యార్థుల ఆందోళన

విద్యాశాఖలో నిలిచిన సేవలు

మధ్యాహ్న భోజనం బిల్లుల ప్రాసెస్ బంద్

సిద్దిపేట అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో చదువులకు ఆటంకం కల్గుతోంది. ఓవైపు పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండగా సిలబస్ పూర్తి చేయాల్సిన కీలకమైన సమయంలో కేజీబీవీల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ సమ్మె విద్యాశాఖపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లాకు సంబంధించి 12 విభాగాల్లో ఫైల్స్ కదలడం లేదు.

సమ్మెలో 874 మంది ఉద్యోగులు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 12 విభాగాల్లో సుమారు 874 మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు ఉన్నారు. సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఏపీవోలు, సిస్టం అనలిస్టులు, టెక్నికల్‌పర్సన్‌లు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, కేజీబీవీ ఉద్యోగులు, యూఆర్ఎస్ ఎస్‌వోలు, సీఆర్టీలు, పీజీసీ, ఐఈఆర్పీలు 25 రోజులుగా విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నారు.

సమస్యల పరిష్కారమయ్యే వరకు పోరాటం



25 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అసలు మీ సమస్య పెద్ద విషయం కాదని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు ముఖం చాటేయడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. లేదంటే సమ్మె ఉధృతం చేస్తాం.

- కృష్ణవేణి, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకురాలు





ఉపాధ్యాయులు కావాలంటూ నిరసన తెలియజేస్తున్న కేజీబీవీ విద్యార్థులు, ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు(ఫైల్)

కేజీబీవీ విద్యార్థుల ఇంటిబాట

నిరవధిక సమ్మెతో కేజీబీవీ పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడింది. జిల్లా వ్యాప్తంగా 23 కేజీబీవీల్లో దాదాపు 300పైచిలుకు ఉపాధ్యాయులు ఉండగా వారంతా సమ్మెలో పాలుపంచుకుంటున్నారు. ఇప్పటికే గజ్వేల్, తొగుట కేజీబీవీల్లో విద్యార్థులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు కావాలని పాటలు పాడుతూ నిరసన తెలపగా, ఇటీవల సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. అటు తరగతులు లేకపోవడం, ఇటు పండుగ దగ్గరలోనే ఉండడంతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 30 నుంచి 40 శాతం మంది విద్యార్థులు కేజీబీవీ పాఠశాలల నుంచి ఇంటిదారి పట్టారు. సమ్మెలో ఉంటున్నప్పటికీ విద్యార్థులకు రక్షణగా రాత్రి సమయాల్లో టీచర్లు హాస్టళ్లకు వెళ్తున్నారు. కానీ బోధన మాత్రం చేయడం లేదు. ప్రభుత్వం ఎస్‌వోలకు బదులుగా ప్రభుత్వ ఉపాధ్యాయులను పర్యవేక్షించాలని సూచించడంతో గత నెల 27వ తేదీ నుంచి రాత్రి సమయాల్లోనూ వారు ఉండడం లేదు. పూర్తిస్థాయిలో సమ్మెలో పాల్గొంటున్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడం, అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలు షెడ్యూల్ విడుదల కావడంతో ప్రస్తుత సమయంలో సమ్మెతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్నది.

నిలిచిపోయిన సేవలు

సమ్మెతో జిల్లా, మండల స్థాయి కార్యాలయాల్లో ఫైలు ఆగిపోయాయి. స్కూల్ ఎడ్యుకేషన్ సమగ్ర శిక్షా అధికారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. డీఈవో కార్యాలయాల్లో నిత్యం ఉన్నతాధికారులకు అందించాల్సిన ఫైల్స్ ఆగిపోయాయి. ప్రధానంగా మధ్యాహ్న భోజన పథక బిల్లులు, యూడీఐ ప్లస్ డాటా నమోదు, టీచర్ల ఆన్‌లైన్ డేటా అప్లోడ్, అప్‌గ్రేడేషన్ వంటి అనేక పనులు నిలిచిపోయాయి.

సంగారెడ్డి జిల్లాలో ఎంఆర్‌సీ, కేజీబీవీల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు

సంగారెడ్డి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో కేజీబీవీలతో పాటు మండల వనరుల కేంద్రాల(ఎంఆర్‌సీ) సేవలు నిలిచిపోయాయి. దీంతో జిల్లా విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు తాత్కాలికంగా విధులు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో 18 మంది స్ట్రాంగ్ టీచర్లను ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించేలా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 29 ఎంఆర్‌సీ కార్యాలయాల్లో ఇద్దరు చొప్పున స్ట్రాంగ్ ఉపాధ్యాయులను తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె ముగిసి విధుల్లో చేరే వరకు వారి స్థానాల్లో సర్కారు ఉపాధ్యాయులు విధుల్లో ఉండనున్నారు.

తహసీల్ కార్యాలయంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

మద్దూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్దూరు తహసీల్ కార్యాలయంలో నెలల తరబడిగా ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. మండలం 11 గ్రామాలు ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దారు, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, సర్వేయర్‌తో పాటు 6గ్రామాలకు వీఆర్ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం గ్రామానికో వీఆర్‌వోను నియమించనుండటంతో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యాలయ ప్రధానమైన అధికారులు లేకుండా పోవడంతో మండల ప్రజలతో పాటు రైతులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి మండల ప్రజల ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే తోర్నాల, కొండాపూర్, రెడ్యానాయక్ తండా, హన్మతండా జీపీలలో సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంపీడీవో రాంమోహన్ తెలిపారు.

ఇళ్ల సర్వేను పరిశీలించిన కమిషనర్

గజ్వేల్, జనవరి 3(ఆంధ్ర జ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలోని ఆయా వార్డులలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య పరిశీలించారు. వార్డు ఆఫీసర్లు చేస్తున్న సర్వేతో పాటు డాటా ఎంట్రీని పరిశీలించిన ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు. ఆయనవెంట మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

నల్లాలకు మోటర్లు బిగించొద్దు

సిద్దిపేట టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా మంచి నీటి సరాఫరా జరిగేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలల్లో కమిషనర్ పర్యటించారు. లో లెవల్ వాటర్ ట్యాంకు లైన్‌మెన్‌ల హాజరును పరిశీలించారు. మంచి నీటి నల్లాలకు మోటార్లు బిగించవద్దని, నీటిని వృథా చేయకూడదని పట్టణ ప్రజలకు సూచించారు. అనంతరం పట్టణంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త సేకరణ వాహనం ప్రతిరోజూ వస్తుందా అని పట్టణవాసులను అడిగి తెలుసుకున్నారు.

'సంక్రాంతి సంబరాలు విజయవంతం చేయాలి'

సిద్దిపేట క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 5న సిద్దిపేటలోని హైస్కూలు గ్రౌండులో నిర్వహించే సంక్రాంతి సంబరాలు విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూది శ్రీకాంత్ రెడ్డి కోరారు. కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

మల్లన్న ఆలయ కమిటీ 'చైర్మన్' కురుమలకు ఇవ్వాలి

చేర్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ పదవిని కురుమ సామాజికవర్గానికి చెందినవారికే కేటాయించాలని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు ఒగ్గు రాజు పేర్కొన్నారు. శుక్రవారం చేర్యాలలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమురవెల్లి మల్లన్న కురుమల ఆరాధ్యదైవమని, గత ప్రభుత్వంలో కూడా కురుమలకే అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. అయితే తక్కువ జనాభాశాతం కలిగిన సామాజిక వర్గానికి ఈ పదవిని కట్టబెట్టాలని యత్నించడం సరికాదన్నారు.

మొక్కజొన్నకు 'కత్తెర' కాటు

కోహెడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కోహెడ గ్రామ పరిధిలో మొక్కజొన్న పంటలను వ్యవసాయ అధికారులు శుక్రవారం పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు సోకిందని, అలాగే వాతావరణ మార్పుల వల్ల ఆకులు ఉదా రంగులోకి మారాయని గమనించడం జరిగిందని వ్యవసాయ అధికారి సతీష్ తెలిపారు. దీనికి రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కత్తెర పురుగు నివారణకు4 మి.లీ. క్లోరం ట్రానిలిప్రోల్ లేదా 0.5 మి.లీ. స్పైనటోరం మందును లీటరు నీటికి కలిపి ఆకు సుడుల లోపల తడిచేలా పిచికారి చేయాన్నారు.





గ్రామ శివారులోని బహిరంగ ప్రదేశాల్లో వేసిన చెత్త

కొమురవెల్లి..చెత్త లొల్లి

సిద్దిపేట జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొమురవెల్లి దేవస్థానం, పరిసర ప్రాంతాల్లో నుంచి సేకరించే చెత్తను ఊరవతల పారబోస్తున్నారు. ఆ తర్వాత నిప్పంటిస్తున్నారు. అది కొంత వరకు దగ్ధమై, మరికొంత కాలిపోకుండానే ఉంటుంది. అయితే ఇక్కడ తడి పొడి చెత్త వేరు చేసేందుకు, కంపోస్టు ఎరువు తయారు చేయడానికి డంప్ యార్డు ఉన్నప్పటికీ చెత్తను బయట బహిరంగ ప్రదేశాల్లో వేయడం గమనార్హం. ఆ చెత్త పక్కనే ఉన్న కుంటలో పడి జలం కాలుష్యమవుతుంది. తడి, పొడి, హానికర చెత్తను వేరుచేయకుండా తగులబెట్టడం వల్ల సమస్యలు వస్తాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటో గ్రాఫర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి)



సమీపంలోనే నిరుపయోగంగా ఉన్న డంప్ యార్డు

విద్య, పరిశోధనల్లో 'ఏఐ' పాత్రపై

సిద్దిపేట డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు, పోస్టర్లను తిలకిస్తున్న విద్యార్థినులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య, పరిశోధనల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) అనే అంశంపై సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా నేషనల్ సెమినార్ శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతీయ సదస్సు తెలంగాణ ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో మైక్రో బయాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మొదటిరోజు ముఖ్యవక్తలుగా హాజరైన ప్రొఫెసర్ శరత్‌బాబు, డాక్టర్ సతీష్, ప్రొఫెసర్ డా. పూర్ణచందర్ రావు, డా. సీహెచ్ ప్రదీప్ కుమార్ ఏఐ గురించి వివరించారు. వివిధ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. వైద్య రంగంలో ఏఐ పాత్ర, కేన్సర్ నివారణలో ఏఐ ఎలా వాడుతారు అనే అంశాలపై వివరించారు. విద్య, వైద్యం, వ్యాపారం, వ్యవసాయం, గూగుల్ అసిస్టెంట్స్ అలెక్సా, సిరి వంటి అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ముడిపడి ఉందని వక్తలు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతకు ముందు సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ విద్యారంగంలో కృతిమ మేదస్సును విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు.

సదస్సు కార్యదర్శి మదన్ మోహన్, కన్వీనర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి 200 పైగా పరిశోధనా పత్రాలు వచ్చాయని వివరించారు. సదస్సుకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర , తమిళనాడు నుంచి పరిశోధకులు హాజరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌కు సంబంధించి ప్రదర్శించిన పోస్టర్లను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆయోధ్యరెడ్డి, సులేమాన్ అహ్మద్, గోపాల సుదర్శనం, మధుసూదన్, లీలావతి, ఉమామహేశ్వరి, సంపత్‌కుమార్, పిట్లదాసు, మహేష్, గురుచరణ్ దాసు, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, విశ్వనాథం పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ఇంకాస్త లేటే..!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాలకు తరలివెళ్లారు. అంతేకాకుండా ఒకే ఇంట్లో ఇద్దరు ముగ్గురు దరఖాస్తు చేసుకోవడం కూడా సమస్యగా మారింది.

సగం పని ఏఐకి అప్పగింత?

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మాత్రమే మంజూరు చేయనున్న ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొంతవరకు సహకారంతో ఎంపిక చేయనున్నట్లు సమాచారం. గ్రామాల వరకు పెద్దగా ఇబ్బంది లేకపోయినా.. మున్సిపాలిటీలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో వచ్చిన దరఖాస్తుదారులకు ఇళ్లను కేటాయిస్తే.. 3,500 ఇళ్లు ఎటూ సరిపోవు. జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో వేలాదిగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అత్యవసరంగా ఇళ్లు కేటాయించాల్సిన లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వేతో పాటు ప్రజాపాలన దరఖాస్తులు, 2015 సకల జనుల సర్వే డేటా, సర్వే బృందం సేకరిస్తున్న ఇళ్ల స్థలాల వివరాలు, ఫొటోలు, ప్రస్తుతం ఉన్న ఇళ్ల ఫొటోలను అనుసంధానం చేసి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) ఆధారంగా సగం మంది లబ్ధిదారులను గుర్తించనున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఇందిరమ్మ కమిటీలు, గ్రామసభల ద్వారా మిగిలిన లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే సుమారు మరో రెండు నెలలు పట్టే అవకాశం లేకపోలేదు. దీంతో ఈ సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసే పరిస్థితి ఉండదని అంటున్నారు.

ఉగాది బాలల కథల పోటీకి విద్యార్థుల రచనలకు ఆహ్వానం

కొండపాక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదిన సందర్భంగా బాలల్లో సాహిత్య సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల నుంచి కథలను ఆహ్వానిస్తున్నామని సుగుణ సాహితీసమితి కన్వీనర్ భైతి దుర్గయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రథమ బహుమతి రూ.1500, ద్వితీయ బహుమతులు(2) రూ.1000 చొప్పున, తృతీయ బహుమతులు(3) రూ.500 చొప్పున, రూ.300 చొప్పున 12 ప్రత్యేక బహుమతులను ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్పడగ చెన్నకృష్ణారెడ్డి అందిస్తారని తెలిపారు. హామీ పత్రంతో పాటు విద్యార్థులు తాము రాసిన కథలను కన్వీనర్, ఉగాది కథల పోటీ, ప్రతిభ డిగ్రీ కళాశాల, మెదక్ రోడ్ సిద్దిపేట-502103 చిరునామాకు ఫిబ్రవరి 5వ తేదీలోగా స్వయంగా లేదా రిజిస్టర్ పోస్టు, కొరియర్ ద్వారా పంపగలరని పేర్కొన్నారు. వివరాలకు 9959007914 సెల్ నంబర్‌కు సంప్రదించవచ్చునని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సిద్దిపేటలో హెల్మెట్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేట క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వాహనదారులకు సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆయన సిద్దిపేట పట్టణం ఓల్డ్ బస్టాండ్ నుంచి ఓల్డ్ బస్టాండ్ వరకు నిర్వహించిన హెల్మెట్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ట్రాఫిక్ పోలీసులు ఓల్డ్ బస్టాండ్ చౌరస్తా వద్ద హెల్మెట్ గురించి అవగాహన నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికి గులాబీ పువ్వులు ఇచ్చి హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మధు మాట్లాడుతూ మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐలు ఉమేష్, రఘు, సదాశివరావు, ట్రాఫిక్ సిబ్బంది, సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, పట్టణ యువకులు పాల్గొన్నారు.

పలుచోట్ల జాతీయ రోడ్డు భద్రతామాసోత్సవాలు

● గజ్వేల్, జనవరి 3(ఆంధ్ర జ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గజ్వేల్ పట్టణంలో శుక్రవారం గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ, నిబంధనలు, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్రామారెడ్డి, జగదీశ్వర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో గజ్వేల్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏంవీఐ) పురుషోత్తమ్ క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు, డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలను, ట్రాఫిక్ నియమాలను వివరించారు. ఆయన వెంట రవాణా శాఖ సిబ్బంది తదితరులున్నారు.

ధ్యానాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలి



గజ్వేల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నగేశ్

గజ్వేల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధ్యానాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు వడ్డేపల్లి నగేశ్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన హార్ట్‌ఫుల్‌నెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వార్షిక పరీక్షల నేపథ్యంలో ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి వివరించారు. ధ్యానం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని, మానసిక సమస్యలు దూరమవుతాయన్నారు.



ఎస్జీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నంగునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్జీటీయూ నూతన క్యాలెండర్‌ను నంగునూరులో ఎంఈవో దేశిరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గొట్టిపర్తి రామస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల పరిరక్షణకు ఎస్జీటీ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీటీయూ మండల అధ్యక్షుడు బాలకిషన్, ఎస్టీటీయూ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్, యాదవరెడ్డి, చంద్రం కళ్లాటి శ్రీనివాస్, వెంకటేశం, రామ్‌రెడ్డి, కవిత, యాదయ్య, నాగయ్య చంద్రకాంత్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, జైపాల్ యాదవ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సావిత్రిబాయి ఫూలే కృషి



సిద్దిపేటలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మను చౌదరి



సిద్దిపేటలోని విపంచి కళా నిలయం చౌరస్తా వద్ద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



మర్కూక్: అంగడి కిష్టాపూర్‌ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళలకు విద్యను అందించి మహిళా సాధికారత కోసం పాటుపడిన సావిత్రిబాయిపూలే జయంతిని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలతో పాటు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలుచోట్ల మహిళా ఉపాధ్యాయులను, అధ్యాపకులను సన్మానించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని ఆమె విశ్వసించారని కొనియాడారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేటలోని విపంచి కళా నిలయం చౌరస్తా వద్ద వివిధ ప్రజా సంఘాల నాయకులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా అధ్యాపకులను, ఉపాధ్యాయులను సన్మానించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సీఐటీయూ, ఐద్వా, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్ లో డీబీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. రాయపోల్ మండలం కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రుల సహకారంతో సుమారు 300ల రకాల వంటకాలను ప్రదర్శించారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే విగ్రహానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత పూల మాలలు వేసి నివాళులర్పించి, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సావిత్రిబాయి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

పురుగుల మందు తాగిన వివాహిత మృతి

చేర్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన దాసారపు గంగమణి(38) ఇటీవల తమ ఇంట్లో ఇద్దరు కుమారులు ఆడుకుంటూ అల్లరి చేయగా మందలించింది. ఈ విషయమై పెద్దకుమారుడు తమ్ముడిని ఎందుకు కొట్టావంటూ ఆమెను నిలదీయడంతో క్షణికావేశానికి గురై పురుగులమందు తాగింది. చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. అనంతరం ఆమెను ఆర్‌వీఎం ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ రాజు తెలిపారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన సీపీ



కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ, అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ మను చౌదరికి సీపీ అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగాజిల్లాలోని వివిధ ఉద్యోగ సంఘాలు, ఆయా శాఖ ల అధికారులు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ప్రతినిధులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధంగా ఉండాలి

దౌల్తాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సరకులను పరిశీలించారు. ఇద్దరూ మహిళా ఉద్యోగులు తమకు 6 నెలల నుంచి జీతాలు రావడం లేదని డీఈవోకు విన్నపించారు. వెంటనే పెరోల్ నెంబర్ ఇచ్చి జీతాలను అందజేస్తామన్నారు. విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. మార్చిలో జరిగే 10వ తరగతి పరీక్షలకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. డీఈవో వెంట మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి



మద్దూరు పీహెచ్‌సీలో అధికారులతో డిప్యూటీ డీఎంహెచ్‌వో

మద్దూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో నారాయణరావు సూచించారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి సమయానుకూలంగా సిబ్బందితో పాటు వైద్యాధికారులు హాజరవుతున్నారని తెలిపారు. అలాగే గతంలో దూళిమిట్ట మండల కేంద్రంలో సబ్‌సెంటర్ నిర్మాణానికి రెండు గుంటల స్థలాన్ని అందించిన దాత చిలుక ఎల్లయ్య నష్ట పరిహారం కోసం జిల్లా కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిస్థితిపై పరిశీలించి నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లద్నూరు మద్దూరు వైద్యాధికారి సుధీర్‌రాజ్, రజితతో పాటు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులే ఆచార్యులుగా..



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిద్దిపేట అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆచార్యులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారని సరస్వతి విద్యాపీఠం సిద్దిపేట జిల్లా కార్యదర్శి సాంబశివరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని తడకపల్లి గ్రామ శివారులోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తడ్కమడ్ల ఈశ్వరయ్య, పాఠశాల అధ్యక్షుడు కొమురవెల్లి శేఖరం, కరీంనగర్ విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవీందర్, పాఠశాల కార్యదర్శి మంతపురి నారాయణ, సిద్దిపేట జిల్లా కార్యదర్శి సాంబశివ రావు, ప్రధానాచార్యులు మద్దుల నవీన్, అకడమిక్ ఇన్‌చార్జి మడుపు విజయలక్ష్మి, సిద్దిపేట శ్రీసరస్వతీ శిశుమందిర్ కార్యదర్శి పెద్ది వైకుంఠం, ఆచార్యులు పాల్గొన్నారు.

భవిష్యత్తు అంతా ఇంగ్లిషదే..



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో

మర్కూక్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అంతా ఇంగ్లిష్ పైనే ఆధారపడి ఉందని, విద్యార్థులు ఆంగ్లభాష మీద పట్టు పెంచుకొని ఇష్టంతో చదవాలని మర్కూక్ మండల ఈఈఎల్ టీఏ కన్వీనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల మర్కూక్ మండల కేంద్రంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ ఒలంపియాడ్ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఎంఈవో వెంకట్‌రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాకరణాంశాల మీద పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస, వ్యాకరణాంశ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం ఎంఈవో చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. వెంక టేశం, లయన్ రమణారావు, ఆంగ్లభాష ఉపాధ్యాయులు యాదిరెడ్డి, విగ్నేశ్వరరావు, సుబాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

● మద్దూరు: మద్దూరు మండల కేంద్రంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో శుక్రవారం సంయుక్తంగా ఎల్టా మండల కన్వీనర్ లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన ఇంగ్లిష్ ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన మానిటరింగ్ కమిటీ

నంగునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కెనపల్లి మోడల్ స్కూల్‌ను శుక్రవారం మానిటరింగ్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డాక్టర్ వన్నీస్సా, దుర్గాప్రసాద్, రవీందర్ గౌడ్, బుచ్చిబాబు,సతీష్ కుమార్, నర్సింహులు ఉదయం స్కూల్ ప్రార్థన సమయానికే పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలలో అధ్యాపకుల బోధన విధానం, తరగతుల నిర్వహణ, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మూత్రశాలల నిర్వహణ, మధ్యాహ్న భోజన నాణ్యత, ప్రయోగశాల, విద్యార్థుల ప్రగతి పత్రాలను వారు పరిశీలించారు. అధ్యాపకుల బోధన, పని తీరుపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.